రోడ్డుపై ధాన్యం.. జరభద్రం.. 2





2 రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లు ధ్వంసం



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## జాతీయస్థాయి కబడ్డీ క్యాంప్‌నకు జిల్లా క్రీడాకారులు



**అక్షరటుడే, బాల్కొండ:** హైదరాబాద్‌లోని బాచుపల్లిలో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ శిక్షణ శిబిరానికి జిల్లా నుంచి క్రీడాకారులు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 25వ తేదీ నుంచి 28 వరకు ముప్కాల్‌లో 35వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీ నిర్వహించారు. టోర్నీలో ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయి కబడ్డీ క్యాంప్‌నకు ఎంపిక చేశారు. బాలికల విభాగంలో స్నేహ, శిరీష, గౌతమి, బాలుర విభాగంలో శ్రీనివాస్, ప్రమోద్ ఉన్నారు.



**కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు, సిబ్బందిపై ఎస్పీ రాజేష్ చంద్ర కఠినంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఏ చిన్న ఆరోపణలు వచ్చినా సత్వరమే విచారణ జరిపించి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు సీఐలు, ఎస్సైలు, సిబ్బందిపై సస్పెన్షన్‌తో పాటు బదిలీ వేటు వేశారు. దీంతో అధికారులు, సిబ్బంది తీరులో చాలా వరకు మార్పు కనిపించింది. కానీ కామారెడ్డి నియోజకవర్గం పరిధిలో పనిచేస్తున్న పలువురు అధికారులు ఏ మాత్రం మారడం లేదని తెలుస్తోంది.** – అక్షరటుడే, నిజామాబాద్



# ఖాకీల అక్రమాల పర్వం..

- అధికార పార్టీ నేత సోదరుడి అండదండలు..
- ఆరోపణలు వచ్చిన ఇన్‌స్పెక్టర్‌పై విచారణ ప్రారంభం..

కామారెడ్డి నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం పనిచేస్తున్న సీఐలు, ఎస్సైలలో ఒకరిద్దరు మినహా మిగతా వారంతా కూడా అధికార కాంగ్రెస్‌కు చెందిన మైనారిటీ నేత ద్వారా పోస్టింగ్‌లు దక్కించున్న వారే. కాగా.. సదరు మైనారిటీ నేత సోదరుడి కనుసన్నల్లోనే నియోజకవర్గంలో సీఐ, ఎస్సైలు పనిచేస్తున్నారు. ముఖ్యంగా కొందరు తమ పరిధిని దాటి అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కాగా.. ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చిన ప్రతిసారి సదరు నేత జోక్యం చేసుకుని ఎలాంటి చర్యలు లేకుండా చూస్తున్నారనే ప్రచారంలో ఉంది.

ఇదే కారణంతో గతంలో కామారెడ్డి పట్టణ సీఐగా పనిచేసిన అధికారిపై తీవ్ర ఆరోపణలు వచ్చినప్పటికీ ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. సివిల్ సెటిల్‌మెంట్లు, తగాదాలను ఠాణాల్లోనే పరిష్కరించి పెద్దమొత్తంలోనే దండుకున్నట్లు అప్పటి అధికారిపై ఆరోపణలు వచ్చాయి. ఇదే తరహాలో ప్రస్తుతం పనిచేస్తున్న ఒకరిద్దరు అధికారులు సైతం అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. క్రమశిక్షణను మరిచి సొంతంగా ఫాంహౌస్‌లు నిర్మించుకుని వాటిల్లోనే సెటిల్‌మెంట్లు, అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

### విచారణ షురూ.. చర్యలుంటాయా..?

తాజాగా ఓ ఇన్‌స్పెక్టర్‌పై వచ్చిన ఆరోపణల విషయంలో పోలీసు ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. 'అక్షరటుడే'లో వచ్చిన కథనం ఆధారంగా ఎంక్వైయిరీ మొదలుపెట్టారు. సదరు సీఐపై వచ్చిన ఆరోపణలపై కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆరా తీస్తున్నారు. మరో వైపు ఇంటలిజెన్స్ అధికారులు సైతం సదరు ఇన్‌స్పెక్టర్ అడ్డగోలు వసూళ్లు, ఫాంహౌస్ వ్యవహారంపై ఆరా తీసి నివేదిక పంపినట్లు సమాచారం. ఒకవైపు పోలీస్‌బాస్ క్రమశిక్షణ మరిచిన వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంటే.. కిందిస్థాయి అధికారులు మాత్రం అధికార పార్టీ నేతల అండదండలు చూసుకుని బాధ్యతారహితంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. నేతల అండ చూసుకొని పోలీస్ శాఖకు మచ్చ తెచ్చేలా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే తదుపరి ఇతర అధికారులు తప్పిదానికి పాల్పడరనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.








## విద్యార్థుల వివరాలు యూడైస్‌లో నమోదు చేయాలి

**అక్షరటుడే, బోధన్:** ప్రతి విద్యార్థి వివరాలను యూడైస్‌లో నమోదు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. నవీపేట మండల కేంద్రంలోని దర్యాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. యూడైస్‌లో విద్యార్థుల వివరాల నమోదు గురించి ఆరా తీశారు. బర్త్ సర్టిఫికెట్ లేకపోవడం వల్ల కొంతమంది విద్యార్థుల వివరాలను నమోదు చేయలేదని పాఠశాల హెచ్‌ఎం హన్మంతరావు తెలుపగా.. కలెక్టర్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. బర్త్ సర్టిఫికెట్ లేని విద్యార్థులకు వాటిని ఇప్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, అవసరమైన వారి ఆధార్ వివరాలను కూడా అప్డేషన్ చేయించాలని ఆదేశించారు. జనన ధ్రువీకరణ పత్రం కోసం బర్త్ సర్టిఫికెట్ లేని విద్యార్థులు అందరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. దరఖాస్తులు వచ్చిన వెంటనే



విద్యార్థులకు బర్త్ సర్టిఫికెట్లు జారీ చేయాలని తహశీల్దార్ వెంకటరమణకు సూచించారు. కాగా.. ప్రతి విద్యార్థికి సంబంధించి అపార్ జెనరేట్ జరగాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు ముఖ గుర్తింపు విధానం ద్వారానే వంద శాతం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో అశోక్, ఎంపీడీవో నాగనాథ్, తహశీల్దార్ వెంకట రమణ, ఇంజినీరింగ్ విభాగం అధికారులు జి.రవి, ఉదయ్ కిరణ్, భవిత కేంద్రాల జిల్లా ఇన్‌ఛార్జి ప్రకాశ్ తదితరులున్నారు.



## యూనివర్సిటీని అక్రమాలకు అడ్డాగా మార్చవద్దు

**అక్షరటుడే, డిచ్‌పల్లి :** తెలంగాణ వర్సిటీని అక్రమాలకు అడ్డాగా మార్చవద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. వర్సిటీలో బుధవారం వీసీ యాదగిరి రావును కలిసి మాట్లాడారు. యూనివర్సిటీలో చేపట్టిన నియామకాల్లో హైకోర్టు తీర్పుని ఎందుకు అమలు చేయట్లేదని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి సురేష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.





## అభివృద్ధి పనులను వేగవంతం చేశాం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. జుక్కల్ మండలం మైబాపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణ పనులకు, బిజ్జల్‌వాడి గ్రామంలో రూ.29 లక్షల నిధులతో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడంతో పాటు పనులు వేగంగా జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## డిజిటల్ లెర్నింగ్ ప్రోగ్రాంతో విద్యార్థులకు ఉపయోగం




**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వం కల్పించిన డిజిటల్ లెర్నింగ్ ప్రోగ్రాంతో విద్యార్థులకు ఎంతో లాభం చేకూరుతుందని మండల విద్యాధికారి యోసెఫ్ అన్నారు. సదాశివనగర్ మండలం తిమ్మాజివాడి ప్రాథమికోన్నత పాఠశాలలో డిజిటల్ లెర్నింగ్ ప్రోగ్రాంను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ డిజిటల్ లెర్నింగ్ ప్రోగ్రామ్ వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న తెలివితేటలు బయటకు వచ్చి భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలు చేస్తారన్నారు. కార్యక్రమంలో కల్వరాల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ విష్ణువర్ధన్, తిమ్మాజివాడి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రజాక్ పాషా, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఏపీపీసీ ఛైర్మన్ సునీత, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కళాభారతి నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలో కళాభారతి నిర్మాణం కోసం పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. నగరంలోని కళాభారతి భవనాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలుగేళ్ల క్రితం గత ప్రభుత్వ హయాంలో కళాభారతి నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. అయితే నిధుల లేమితో ఇప్పటికీ పనులు పూర్తికాలేదని తెలిపారు. కాంట్రాక్టర్‌కు ఏడాదిగా రూ.25 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉంచారన్నారు. జిల్లాలో అనేకమంది కళాకారులు ఉన్నారని, వారి భవిష్యత్తు కోసం నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. రాష్ట్రంలో నిధులు లేవనే కారణాన్ని చూపి బిల్లులను చెల్లించకుండా ఉండకూడదని కోరారు. పెండింగ్ బిల్లులతో పాటు అవసరమైన నిధులు కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు ఇల్లెందుల ప్రభాకర్, ఆనంద్, కృష్ణ, పవన్ తదితరులున్నారు.



# రోడ్డుపై ధాన్యం.. జరభద్రం..



■ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు ■ అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

**రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్నారు. కుప్పలు సైతం అక్కడే చేస్తున్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో వడ్ల కుప్పలు కనిపించక పలువురు వాటిని ఢీకొంటున్నారు. రహదారులపై ధాన్యం ఆరబోయవద్దని అధికారులు చెబుతున్నప్పటికీ కొంతమంది రైతులు అలాగే చేస్తు న్నారు.**

**– అక్షరటుడే, లింగంపేట**

రహదారులపై ధాన్యం కుప్పలు ఉండడంతో ప్రతి ఏటా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిని నివారించేందుకు ఈఏడాది ధాన్యం సీజన్‌కు 15 రోజుల ముందే ఎస్పీ రాజేష్ చంద్ర రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో అవగాహన లోపంతో రైతులు ఎప్పటికలాగే రోడ్లపైనే ధాన్యం పోస్తున్నారు.

### అవగాహన లోపం

రోడ్లపై ధాన్యం వేయకుండా కఠిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. కానీ గ్రామాల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. కొంతమేర పోలీస్ సిబ్బంది గ్రామాల్లో రోడ్లపై ధాన్యం వేయకుండా అవగాహన కల్పించారు. కానీ ఉన్నతాధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో పూర్తిగా అమలు కాలేదని ప్రజలు పేర్కొంటున్నారు.

### కల్లాలు ఏర్పాటు చేయాలి

గ్రామాల్లో ధాన్యం ఆరబెట్టేందుకు కల్లాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు స్థలాలు లేక రోడ్లపైనే తూకాలు వేసే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రతి గ్రామంలో రైతు కల్లాల కోసం, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని అన్నదాతలు కోరుతున్నారు. ప్రత్యేక స్థలం ఉంటే తాము ధాన్యాన్ని అక్కడే ఆరబెట్టుకుంటామని చెబుతున్నారు.

### ఉపాధి హామీ కింద కల్లాల నిర్మాణం

గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకంలో కల్లాలు నిర్మాణం కోసం నిధులను విడుదల చేశారు. అందులో కొందరు రైతులు మాత్రమే కల్లాలను నిర్మించుకున్నారు. రైతులు కల్లాలు నిర్మించుకునేలా అవగాహన కల్పించడంతో పాటు సబ్సిడీలు ఇస్తే ఫలితం ఉంటుంది.

### చర్యలు చేపట్టాం..



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా క్షేత్ర స్థాయిలో సిబ్బందితో అవగాహన కల్పించాం. ఈ ఏడాది తాడ్వాయి మండలం చందాపూర్ గ్రామానికి చెందిన ఓ ద్విచక్ర వాహనదారుడు మొక్కజొన్న కుప్ప రోడ్డుపై వేయడంతో దాన్ని ఢీకొని మృత్యువాత పడ్డాడు. ఇప్పటికైనా రైతులు ప్రమాదాలకు కారణం కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకోవాలి. గ్రామాల్లో వ్యవసాయ అధికారుల సైతం రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా అవగాహన కల్పించాలి.

**– రాజారెడ్డి, సీఐ, ఎల్లారెడ్డి**

## టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు



**అక్షరటుడే, ఇందూరు:** అన్ని శాఖల ఉద్యోగులు టీఎన్జీవోస్ సభ్యత్వాన్ని స్వీకరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్ కుమార్ కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ ఎంతగానో కృషి చేస్తోందన్నారు. అనంతరం విద్యాశాఖలోని ఉద్యోగులతో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, సంయుక్త కార్యదర్శి జాఫర్ హుస్సేన్, టీఎన్జీవోస్ నిజామాబాద్ అర్బన్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి, విద్యాశాఖ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అశ్విన్, అన్వేష్, సలహాదారు వనమాల సుధాకర్ పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి జిల్లా అడ్‌హక్ కమిటీ నియామకం

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ జాగృతి జిల్లా అడ్‌హక్ కమిటీని బుధవారం అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. జిల్లా కమిటీలో సూదం రవిచందర్, అవంతి కుమార్, ఎంఏ రజాక్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీనారాయణ భరద్వాజ్, మహమ్మద్ రెహాన్ అహ్మద్, విజయలక్ష్మి, నవీన్ పటేల్‌ను నియమించారు. అలాగే అధికార ప్రతినిధులుగా తెలంగాణ శంకర్, సంజీవ్, శేఖర్ రాజ్, సంతోష్ నాయక్, తిరుపతి రామును నియమించారు. జిల్లా కమిటీతో పాటు నియోజకవర్గాల వారీగా కమిటీలను ప్రకటించారు. ఇందులో భాగంగా బోధన్ నియోజకవర్గ కమిటీలో ప్రవీణ్ కుమార్, రాఘవేందర్ యాదవ్, సాయిలు, నూర్ ఫతేపూర్, శ్రీనివాస్ ఉన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అడ్‌హక్ కమిటీలో కరిపె రాజు, మహమ్మద్ రెహాన్ అహ్మద్, శంకర్, పంచ రెడ్డి మురళి, ఎండల ప్రసాద్, శ్రీనివాస్ గౌడ్, సాయి కృష్ణ, శానవాజ్ ఖాన్‌ను నియమించారు. నిజామాబాద్ రూరల్‌లో బానోతు నరేష్ నాయక్, బానోత్ ప్రేమ్ దాస్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఆర్మూర్ కమిటీలో ఏలేటి నవీన్ రెడ్డి, మనోజ్ రావు, మహమ్మద్ ఆజం, బాల్కొండ కమిటీలో మహేందర్ రెడ్డి, ధీరజ్‌లను నియమించారు.

## భక్తి శ్రద్ధలతో నవదుర్గా మాత ఆలయ వార్షికోత్సవం



**అక్షరటుడే, ఇందూరు :** నగరంలోని పాత కలెక్టరేట్ ప్రాంగణంలో నవదుర్గా మాత ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అలుక కిషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో యజ్ఞం చేశారు. ఉత్సవాలకు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కమిటీ కార్యదర్శి అమృత్‌కుమార్, సహాధ్యక్షులు చిట్టి నారాయణ, కోశాధికారి సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పెద్దోళ్ల నాగరాజు, ఉమా కిరణ్, సత్యం, గంధం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి


**అక్షరటుడే, బాల్కొండ:** విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని బాల్కొండ ఎంఈవో బట్టు రాజేశ్వర్ పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో బాల్కొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. క్విజ్‌లో టెన్త్ విద్యార్థిని పి.సంజన ప్రథమ బహుమతి సాధించగా, అదే పాఠశాల విద్యార్థిని సాయి శివాని ఉపన్యాస పోటీలో 'బాలవక్త'గా ఎంపికైంది. ఈ సందర్భంగా ఎంఈవో రాజేశ్వర్ విద్యార్థినులను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు, గైడ్ టీచర్లు వేల్పూర్ శ్రీనివాస్, కవితా రాణి తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లికొడుకు ఆత్మహత్య



**అక్షరటుడే, బోధన్:** పెళ్లింట్లో ఊహించని విషాదం నెలకొంది. ఒక రోజులో పెళ్లి ఉండగా.. వరుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఎడపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రమ తెలిపిన ప్రకారం.. ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన ప్రతాప్‌గౌడ్‌కు గురువారం పెళ్లి జరగాల్సి ఉంది. అయితే ప్రతాప్ గౌడ్ రెండురోజులుగా కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబీలకు అతడి కోసం తీవ్రంగా గాలించారు. గ్రామశివారులో బుధవారం ప్రతాప్‌గౌడ్ ఉరి తాడుకు వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొన్న లారీ..



**అక్షరటుడే, కామారెడ్డి :** హైవే పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటన 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వెనుక నుంచి లారీ ఢీకొనడంతో కానిస్టేబుల్, హోంగార్డులకు గాయాలయ్యాయి. కామారెడ్డి మండలం క్యాసంపల్లి శివారులో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున 5.40 గంటలకు పోలీస్ పెట్రోలింగ్ వాహనం యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సదయ్య అనే కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు కాగా.. హోంగార్డు స్వామిరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఇద్దరిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కానిస్టేబుల్ సదయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. స్వామిరెడ్డికి చికిత్స కొనసాగుతోంది. కాగా.. ప్రమాదానికి కారణమైన లారీని టోల్ ప్లాజా వద్ద పోలీసులు గుర్తించినట్లుగా తెలుస్తోంది. దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లు ధ్వంసం



**నగరంలో శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న బైక్‌ల సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు ధ్వంసం చేశారు. తనిఖీల్లో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు ఏర్పాటు చేసిన సైలెన్సర్లను తొలగించారు. వాటిని బుధవారం నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద రోడ్ రోలర్‌తో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఆర్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.**

**– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ**

## గ్రామానికి బస్సు రావడం లేదని రాస్తారోకో



**అక్షరటుడే, ధర్పల్లి :** తమ గ్రామానికి బస్సు రావడం లేదని రేకులపల్లి గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. ధర్పల్లి నుంచి భీమ్‌గల్ వెళ్లే దారిలో బుధవారం గ్రామస్థులు నిరసన చేపట్టారు. గతంలో దుబ్బాక మీదుగా రేకులపల్లికి బస్సులు వచ్చేవని.. అయితే ఇటీవల వర్షాలకు గ్రామ సమీపంలోని వంతెన శిథిలమైందన్నారు. ఈ నెపంతో బస్సులు దుబ్బాకకు వచ్చి అక్కడి నుంచి రేకులపల్లికి రాకుండా.. దుబ్బాక మీదుగా మైలారం కోరట్‌పల్లి, చల్లగరిగె, సుద్దులం యానంపల్లి, డిచ్‌పల్లి, నిజామాబాద్‌కు వెళ్తున్నాయన్నారు. తమ గ్రామం వరకు బస్సు రాకపోవడంతో ఉదయాన్నే వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారికి.. ముఖ్యంగా విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు పేర్కొన్నారు. వెంటనే బస్సు సర్వీసును రేకులపల్లి వరకు పొడిగించాలని వారు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ధర్పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులను సముదాయించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## జాతీయ క్రీడల్లో ప్రతిభ చూపాలి

**అక్షరటుడే, మెండోరా:** క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ చూపి మెండోరా మండలానికి పేరు తేవాలని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎస్జీఎఫ్ అంతర పాఠశాలల క్రీడోత్సవాలను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా శారీరక మానసిక వికాసం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగంపేట్ శేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

